## గిరిజనోద్ధరణకు కృషి చేసిన సంత్ సేవాలాల్

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఫిబ్రవరి 23 : గిరిజనుల ఉద్ధరణకు సంత్ సేవాలాల్ చేసిన కృషి గొప్పదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం హాలియాలోని చైతన్య ఫంక్షన్ హాల్లో ఆలిండియా బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆయన ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సేవాలాల్ ఆశయ సాధనకు గిరిజనులు పాటుపడాలని, ఆయన చూపిన బాటలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆలిండియా బంజార సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ట్రైకార్ మాజీ చైర్మన్ రామ్‌చందర్‌నాయక్, నాయకులు బాబూరావునాయక్, భగవాన్‌నాయక్, శంకర్‌నాయక్, స్కైలాబ్‌నాయక్, రమావత్ రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

### సంత్ సేవాలాల్ జయంతి

చందంపేట(దేవరకొండ) : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఆదివారం దేవరకొండ పట్టణంలోని బంజార భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సేవాలాల్ సేవలను స్మరించుకున్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బిల్యానాయక్, వడ్త్య రమేశ్‌నాయక్, లక్ష్మానాయక్, పాండునాయక్, పాపానాయక్, మకట్‌లాల్, రమేశ్‌నాయక్, గోపాల్‌సింగ్, తలచినాయక్, బద్యానాయక్, శంకర్‌నాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

## భవిష్యత్ అవసరాలకు తగినట్లు రోడ్లు నిర్మించాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను ఆదివారం ఉదయం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మండల కేంద్రంలో మార్నింగ్ వాక్ చేస్తూ రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మితో కలిసి పరిశీలించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌ఓ నర్సిరెడ్డి

## ఆత్మ రక్షణకు కరాటే దోహదం

● డీవైఎస్‌ఓ నర్సిరెడ్డి

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 23 : కరాటే ఆత్మ రక్షణకు, ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని డీవైఎస్‌ఓ నర్సిరెడ్డి అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్, ఎస్‌ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ ఆధ్వర్యంలో షోటోకాన్ స్టేట్ వారియర్ కప్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జిల్లా కేంద్రంలోని దేవరకొండరోడ్డులో ఉన్న ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. పోటీలను రాజ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ చీఫ్ రాపోల్ సుదర్శన్, కరాటే మాస్టర్ నర్సిరెడ్డి, ఆర్గనైజర్ శ్రీధర్, నగేశ్, నాగార్జున, సోములు, వంశీ, నిఖిల్, పవన్ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

## శిలాజ ఇంధనాల పొదుపుతో పర్యావరణ పరిరక్షణ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23: శిలాజ ఇంధనాల పొదుపుతో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారి దిలీప్‌నాయక్ అన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం అందరు సైకిల్‌ను వినియోగించాలని, సొంత వాహనాలకు బదులుగా వీలైనంతవరకు ప్రజా రవాణా సాధనాలను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో గ్యాస్ డీలర్లు గుంటూరు రామారావు, సీహెచ్.మధు, గ్యాస్ డెలివరీ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పేరు మార్పు**
రాపోలు ప్రశాంతి, తండ్రి: క్రిష్ణ కుమార్తె మైనర్ అనగా రాపోలు అన్విక, తండ్రి క్రిష్ణ, వయస్సు:11సం||లు, వృత్తి: విద్యార్థిని, నివాసం, ఇ.నెం.5-26, గ్రా||జాలుకాలువ (గోకారం) మండలం వలిగొండ జిల్లా యాదాద్రి భువనగిరి, ఆదార్ కార్డు ప్రకారం రాపోలు ప్రశాంతి తప్పుగా పడింది దానికి బదులుగా డెటాఫ్ బర్త్ ఉన్నటువంటి పేరు రాపోలు అన్వికగా పేరు మార్పిడి చేయగలరు.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638 |

# సజావుగా గురుకుల ప్రవేశ పరీక్ష

● పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



చర్లపల్లిలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 23: 2025-26 విద్యా సంవత్సరానికి ఎస్సీ,ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతిలో, 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష(టీజీ సెట్) జిల్లాలో సజావుగా ముగిసింది. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి వద్ద ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 12,929 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12,503 మంది హాజరయ్యారని, 426 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 96.71 శాతం విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. ఆమె వెంట జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ రాజ్‌కుమార్, కళాశాల పిన్సిపాల్ పవిత్ర వాణి కర్ష, సంబంధిత అధికారులు ఉన్నారు.

## నేటి నుంచి బీఈడీ రెండో విడుత ప్రాక్టికల్ పరీక్షలు

రామగిరి, ఫిబ్రవరి 23: ఎంజీయూ పరిధిలోని బీఈడీ గ్రూప్-బీ కళాశాలల్లో ఈ నెల 24, 25 తేదీల్లో మూడో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల్లోని విద్యార్థులకు నిర్వహించే ఫైనల్ టీచింగ్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు చేస్తాయని తెలిపారు.

### భార్య కాపురానికి రావడం లేదని.. మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 23: భార్య కాపురానికి రాకపోగా, ఆమె తరుపు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతుండడంతో మనస్తాపానికి గురైన మండలంలోని ఆగామోత్కూరుకు చెందిన నక్క వెంకన్న(35) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన నక్క వెంకన్న భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడం లేదు. తన ఇంటికి రావాలని కోరిన వెంకన్నను భార్య తరుపు వ్యక్తులు బెదిరించారు. దాంతో మనస్తాపానికి గురైన వెంకన్న తన ఇంటి పక్కన ఉన్న బాత్‌రూమ్‌లో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి నక్క చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మోడల్ స్కూల్ హాస్టల్లో కేర్ టేకర్‌ను నియమించాలి

మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య

మర్రిగూడ, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ హాస్టల్లో కేర్ టేకర్‌ను నియమించాలని మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్లో ఉంటున్న విద్యార్థినులకు ఏవైన సమస్యలు తలెత్తితే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని హరిణి అస్వస్థతకు గురైనా ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లే వారు లేక పోవడం దారుణమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మోడల్ స్కూల్ హాస్టల్లో కేర్ టేకర్‌ను నియమించడంతో పాటు రాత్రి సమయంలో సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు.

## ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి : విజయ్

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 23 : హైదరాబాద్‌లోని కొంగరకలాన్ ఇండస్ట్రీ ఏరియాలో ప్రముఖ ఎలక్ట్రానిక్ ఎంఎన్‌సీ ఐఫోన్ కంపెనీలో భారీగా ఉద్యోగ అవకాశాలున్నాయని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రుచిత అసోసియేట్ సభ్యుడు విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో ఆదివారం జాబ్ మేళా నిర్వహించి పలువురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18-30 వయస్సు గల నిరద్యోగ యువత పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా చేసిన వారు అర్హులు అని తెలిపారు. ఈ కంపెనీలో సుమారు 2వేల ఉద్యోగాలు వరకు ఖాళీలున్నాయని అందు కోసం యువత నుంచి దరఖాస్తులు స్వీకరించి చదువుకు తగిన ఉద్యోగం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15171 వేతనంతో పాటు రెండుసార్లు భోజనం, ఉచిత బస్సు, హాస్టల్ వసతి కోసం రూ.2వేలు అదనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు 9347766349, 6300499852, 80084 55311 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### వివాహిత ఆత్మహత్య

మద్దిరాల, ఫిబ్రవరి 23 : మండలంలోని పోలుమల్ల గ్రామానికి చెందిన వివాహిత హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆకుల మల్లేశ్-సరస్వతిల పెద్ద కుమార్తె మనీష(23) గతేడాది తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన సంపత్‌ను ప్రేమ వివాహం చేసుకొని రామంతాపూర్‌లో నివాసం ఉంటున్నది. వివాహం జరిగిన నాటి నుంచి మనిషాను సంపత్ వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయం చేసి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మనీష తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గాంధీ దవాఖానలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.



ట్రాక్టర్‌ను ఢీకొని రోడ్డు కిందికి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

● ఒకరు మృతి, 15 మందికి గాయాలు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23 : ప్రైవేట్ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో మహిళ మృతిచెందారు. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై చింతపల్లి బైపాస్ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన పలువురు హైదరాబాద్‌లో పెళ్లి వేడుకకు హాజరై తిరిగి నెల్లూరుకు వేగ ట్రావెల్స్ బస్సులో ప్రయాణమయ్యారు. మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంక్‌తండాకు చెందిన నూనె సైదాసునీత దంపతులు పెన్‌పహాడ్ మండల కేంద్రానికి ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. చింతపల్లి బైపాస్ వద్ద ప్రైవేటు బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న నూనావత్ సునీత (40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాక్టర్ డ్రైవర్ నూనావత్ సైదాకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న నెల్లూరుకు చెందిన ఉమర్, రాజశేఖర్, నాగచరిత, శైలజ, రాధా, అఖిల, శివరామకృష్ణ, సురేందర్‌రావులతో పాటు బస్సు డ్రైవర్, క్లీనర్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ సైదా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజలు వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి




వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23: పేద ప్రజల అవసరాల కోసం నిర్మించిన వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో రూ.28 లక్షలతో నిర్మించిన వసతిగృహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పేద ప్రజలు శుభకార్యాలు జరుపుకునేందుకు ఈ వసతిగృహం ఉపయోగపడుతుందన్నారు. వసతి గృహంలో అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ పితామహుడు సంత్ గాడ్గే మహారాజ్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్



సంత్ గాడ్గే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23: స్వచ్ఛ భారత్ పితామహుడు సంత్ గాడ్గే మహారాజ్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం సంత్‌గాడ్గే మహారాజ్ 149వ జయంతి సందర్భంగా పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో గాడ్గే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ సంత్‌గాడ్గే మహారాష్ట్రలోని సామాన్య రజక కుటుంబంలో పుట్టి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేశారని, ప్రజలకు పరిశుభ్రత గురించి బోధించే వారని అన్నారు. ఆయన వెళ్లిన ప్రతి గ్రామంలోని మురికి వాడలను శుభ్రం చేసేవారని చెప్పారు. మనుషుల్లో పేదరికం, అసమానతలు పోవాలంటే అది చదువు ద్వారానే సాధ్యమని చెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, కుమ్మరికుంట్ల సుధాకర్, మహేశ్, మదన్‌ప్రసాద్, రాకేశ్, గణేశ్, నవాజ్, శివ, చింటూ, వెంకటేశ్, పవన్, రమేశ్, నరేంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుంగతుర్తి, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సమ్మేళనమయ్యారు. 22 సంవత్సరాల తర్వాత కలువడంతో మిత్రులు ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని, ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణయ్య, హెచ్‌ఎం మల్లయ్య, ఉపాధ్యాయులు నసీరుద్దీన్, సోమన్న, వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, వెంకన్న, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.



బాలు అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

## మాజీ సర్పంచ్ కుటుంబానికి భాస్కర్‌రావు పరామర్శ

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 23: మండలంలోని కొత్తనందికొండ గ్రామ మాజీ సర్పంచ్ రమావత్ బాలూనాయక్(55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం గ్రామానికి చేరుకొని బాలూనాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి, సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం బాలు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, ఆంగోతు హతీరాంనాయక్, కుర్ర సేవ్యానాయక్, శ్రీనునాయక్, ముత్యాలు, స్వామినాయక్, కుర్ర కాంతికృష్ణనాయక్, ఫకీరానాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు, పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే భగత్ పరామర్శ



సయ్యద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

నిడమనూరు, ఫిబ్రవరి 23 : మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ సలీం పాషా తండ్రి సయ్యద్ హుస్సేన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ఆదివారం ముకుందాపురంలోని ఆయన నివాసానికి వెళ్లి సయ్యద్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాంతో పాటు రాజన్నగూడెం గ్రామానికి చెందిన జంగిలి శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ సూరేపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల ఆంజనేయు తండ్రి మారయ్య ఇటీవల మృతి చెందగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండలి చిన్నలింగయ్య, హాలియా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నాయకులు బొల్లం రవియాదవ్, రాం అంజయ్య యాదవ్, మెరుగు రామలింగయ్య, కేశ శంకర్, జానిమియా, నన్నెబోయిన సత్యనారాయణ, భాస్కర్ ఉన్నారు.



మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

## మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం తీసుకు రావాలి

● ప్రభుత్వానికి జేవీవీ నాయకుల డిమాండ్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 23: భారత రాజ్యాంగం ప్రకారం మానవతా విలువలు పెంపొందించడానికి మూఢనమ్మకాల వ్యతిరేక చట్టం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థుల్లో ఉన్న భయాలు, మూఢ నమ్మకాలను తొలగించడానికి సైన్స్ ప్రదర్శనలు చేసి చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం సైన్స్ ఇచ్చిన ఒక విప్లవం అన్నారు. ప్రతి రంగంలో సైన్స్ పాత్ర ఎంతో గొప్పదని, దానిని వినియోగించుకొని విద్యార్థులు మూఢ నమ్మకాలను పారద్రోలాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గంగాధరి భద్రయ్య, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగకళ్యాణి పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్, ఫిబ్రవరి 23 : నకిరేకల్ పట్టణంలోని శివాజీనగర్‌లో నివాసముంటున్న అలిసేరి శ్రావణి మూసీరోడ్డు కార్నర్‌లో చెప్పులు కుడుతూ జీవనం సాగిస్తున్నది. ఆమె కుమారుడు నవనీత్(18 నెలలు) లివర్, క్లోమానికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. అతడికి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో నిరుపేద కుటుంబం కావడంతో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నది. విషయం తెలుసుకున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం ఆమెను కలిసి రూ.22,200 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్, కందగట్ల సందీప్, గోలి పద్మ, నరేందర్, నాగాచారి, సంతోశ్, శ్రీను పాల్గొన్నారు.

## నార్కట్‌పల్లిలో చికెన్ మేళా



చికెన్, కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23 : బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా కోళ్లు చనిపోతున్నాయనే ప్రచారంతో చికెన్ కొనుగోళ్లు భారీగా తగ్గాయి. అయితే చికెన్ తినడం వల్ల ఎలాంటి చెడు నష్టం ఉండదని ప్రజలకు తెలిపేందుకు ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ కాంప్లెక్స్ వద్ద వెన్‌కాబ్ ఆధ్వర్యంలో చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా 200 కిలోల చికెన్, 2 వేల బాయిల్డ్ కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు చికెన్ సెంటర్ నిర్వాహకులు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ అనేది కేవలం కోళ్లకు వచ్చే రోగమని, వండిన చికెన్ తింటే మనకు ఎలాంటి నష్టం ఉండదని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య, నాయకులు జెర్రిపోతుల భరత్, కొండల్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా తప్సీ గాంధీ

సూర్యాపేటటౌన్ : జిల్లా ఆర్యవైశ్య మహాసభల ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు తప్సీ గాంధీ, బజ్జూరి దయాకర్ నియామకమయ్యారు. మహాసభ అధ్యక్షుడు వంపటి వెంకటేశ్వర్‌రావు వీరికి నియామకపత్రాలు అందించారు.